క్లుప్తంగా

గాజుల అలంకరణలో పైడమ్మ అమ్మవారు



పెడన: పట్టణంలో ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారి దేవస్థానంలో రెండో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారిని గాజులతో అలంకరించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాయునందనరావు, ఆలయ ఈవో టీవీవీ మోహనరావు పర్యవేక్షించారు.

ఇనకుదురుపేట సీఐగా పరమేశ్వరరావు



కోనేరుసెంటర్: ఇనకుదురుపేట సీఐగా ఎస్.పరమేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఏలూరు రేంజి వీఆర్ లో ఉన్న పరమేశ్వరరావును ఇనకుదురుపేట పోలీస్‌స్టేషన్ కు బదిలీ చేస్తూ ఐజీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇనకుదురుపేట సీఐగా పనిచేస్తున్న విద్యాసాగర్‌ను పశ్చిమగోదావరి జిల్లా రావులపాలెంకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఐగా బాధ్యతలు తీసుకున్న పరమేశ్వరరావు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పరమేశ్వరరావుకు స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి బీజేపీ నేతల నివాళి

కోడూరు: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిని మండల బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. స్థానిక ప్రధాన సెంటర్‌లో పార్టీ జెండా దిమ్మ వద్ద వాజ్‌పేయి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వడుగు నాగబాబు, జిల్లా కార్యదర్శి దొండపాటి శ్రీనివాసరావు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కొండవీటి రామకృష్ణ, కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ బండే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఘంటసాల: మండలంలోని ఘంటసాల, కొడాలి, శ్రీకాకుళం విద్యుత్ ఉపకేంద్రాల్లో మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ మండల ఏఈ రవికుమార్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు డివిజన్ ఈఈ డి.కృష్ణా నాయక్ ఆదేశాల మేరకు ఘంటసాల, కొడాలి, శ్రీకాకుళం గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 7.30 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ రవికుమార్ కోరారు.

షిర్డీసాయి భక్తుల పాదయాత్ర

అవనిగడ్డ: నాగాయలంక మండలం భావదేవరపల్లిలోని షిర్డీసాయి సేవాశ్రమంకు చెందిన సాయిభక్తులు చేపట్టిన షిర్డీసాయి యాత్ర శుక్రవారం మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో సాగింది. గురువు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో భక్తులు అశ్వరావుపాలెం, మోదుమూడి, అవనిగడ్డ, బందలాయిచెరువు, వేకనూరు, మీదుగా భావదేవరపల్లి వరకూ యాత్ర జరిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పల్లకీలో సాయినాధుని ఊరేగించగా, భక్తులు షిర్డీసాయి సంకీర్తనలు, భజనలు ఆలపిస్తూ సాగారు. బందలాయిచెరువు శ్రీసాయి జ్ఞాన మందిరం నిర్వాహకురాలు సింహాద్రి లక్ష్మి యాత్ర చేపట్టిన భక్తులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన షిర్డీసాయి భక్తులు పాల్గొన్నారు.

అప్సా-డి నూతన కార్యవర్గం

కోడూరు: ఆంధ్రప్రదేశ్ ప్రయివేటు స్కూల్ అసోసియేషన్ డెమోక్రటిక్(అప్సా-డి) అవనిగడ్డ డివిజన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా కోడూరుకు చెందిన లక్ష్య ఇంగ్లిష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ విసంశెట్టి శివనాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా ఎస్.శామ్యూల్ (అవనిగడ్డ), ప్రధాన కార్యదర్శిగా పి.సునీల్‌కుమార్ పట్నాయక్ (నాగాయలంక), సంయుక్త కార్యదర్శిగా పి.మైనయ్య (మొవ్వ), కోశాధికారిగా కె.ఎస్.ఆర్.కె.డి.ప్రసాద్ (కోసూరివారిపాలెం) ఎన్నికయ్యారు.

మోక్షారోహణ పండుగ

చల్లపల్లి(అవనిగడ్డ): చల్లపల్లి మండల పరిధిలోని సాలిపేట ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం రాత్రి మరియమాత మోక్షారోహణ పండుగను ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి ఫాదర్ వి.జోజిబాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాలిపేట విచారణ గురువు బి.రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అవనిగడ్డ, కోడూరు, మచిలీపట్నం, గుంటూరు విచారణ గురువులు సురేష్ మెర్లో, ప్రశాంత్, రత్నరాజు, విజయ్‌తో పాటు పలువురు ఉపదేశీలు సంఘ పెద్దలు పాల్గొన్నారు.

వరిపైరులో జింక్ లోపం

మోపిదేవి: ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారులు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటించి వరిపైరును పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వరిపైరులో జింక్ లోపం గుర్తించినట్లు తెలిపారు. రైతులకు నివారణోపాయాలను సూచించారు.

దిగువ రైతులకు సాగునీరు అందిస్తాం

ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్



దాలిపర్రులో ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్, అధికారులు, రైతులు

దాలిపర్రు(ఘంటసాల): ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని చివరి భూములకు చెందిన దిగువ రైతులకు రాత్రి వేళ సాగునీరందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల, చల్లపల్లి మండలాల పరిధిలోని దాలిపర్రు, మాజేరు గ్రామాల వద్ద పంట కాలువలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ సంబంధిత అధికారులతో కలసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా దాలిపర్రు వద్ద గుండేరు డ్రైన్‌పై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాల ద్వారా జరుగుతున్న సాగునీటి సరఫరాను పరిశీలించారు. ఎన్ని మోటర్లు ఉన్నాయి, సాగునీరు ఎక్కడ వరకు వెళ్తుంది తదితర అంశాలను రైతులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ఎగువ రైతులు దిగువ రైతుల గురించి ఆలోచించి సాగునీటి సరఫరా సక్రమంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న సాగునీటి ఎద్దడి నివారణకు, రైతులకు భవిష్యత్తులో నీటి ఇబ్బందుల్లేకుండా శాశ్వత పరిష్కారం చేసేందుకు చేపట్టాల్సిన పనులను అధికారులతో కలసి పరిశీలించినట్లు చెప్పారు. వర్షాలు తగ్గడం, ఎగువన నాట్లు వేస్తున్న రైతులు దిగువకు సాగునీరు రాకుండా చేయడంతో దిగువ రైతులకు నీటి సమస్య ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి రాత్రివేళ దిగువ రైతులకు సాగునీరందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎగువ రైతులను ఒప్పించి దిగువ గ్రామాలకు సాగునీరు సరఫరా అయ్యేలా ఈ కమిటీల ద్వారా కృషి చేస్తామని, తద్వారా దిగువ రైతులు కూడా సకాలంలో వరినాట్లు వేసుకునేలా కృషి చేస్తానన్నారు. సాగునీటి సమస్య పరిష్కారానికి గుండేరుపై లిఫ్ట్ ఇరిగేషన్లు ఏర్పాటు చేయాలని కోరగా స్పందించిన ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ రైతుల సూచన మేరకు గుండేరుపై మరిన్ని లిఫ్ట్ ఇరిగేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం డ్రైనేజీలు, పంట కాలువల పనులు విస్తృతస్థాయిలో చేపట్టిందని, ఆయా గ్రామాల్లో ఉన్న నాయకులు, ప్రజా ప్రతినిధులు, రైతు పెద్దలు ఈ పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ దోకిపర్తి శాంతకుమారి, తహసీల్దార్ బి.విజయప్రసాద్, మచిలీపట్నం, అవనిగడ్డ ఇరిగేషన్ శాఖ డీఈఈలు మురళీకృష్ణ, రావెళ్ల రవి కిరణ్, చల్లపల్లి సబ్ డివిజన్ డ్రైనేజీ శాఖ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు, ఏఈలు టి.ప్రసాద్, కేవీ సత్యనారాయణ, ఈవో పిట్టి రాంబాబు, ఘంటసాల మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, టీడీపీ నేతలు మిక్కిలినేని మధు, పరిశే చలపతి, రైతులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా పెడన నియోజకవర్గం

అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవంలో ఎంపీ బాలశౌరి



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బాలశౌరి, పక్కన ఎమ్మెల్యే కాగిత తదితరులు

పెడన: పెడన నియోజకవర్గం అభివృద్ధి దిశగా అడుగులు వేయనుందని మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. పెడన పట్టణంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను శుక్రవారం ఆయన పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ పెడన నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. పట్టణంలో మంచినీటి సమస్యతో పాటు డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని రహదారుల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులను తీసుకురావడానికి ఎమ్మెల్యేతో కలిసి కృషిచేస్తానన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సంక్షేమ పాలన ధ్యేయంగా పని చేస్తామన్నారు. అన్న క్యాంటీన్‌కి సాధ్యమైనంత ఎక్కువ మంది విరాళాలు అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్నకు నివాళి

అన్న క్యాంటీన్ పక్కన శ్రీసర్దార్ గౌతు లచ్చన్న ఆశయ సాధన కమిటీ ఆధ్వర్యంలో లచ్చన్న జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన లచ్చన్న చిత్రపటానికి ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపుల్లో కుంభాకార దర్పణాలు

అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రయోగాత్మకంగా రెండుచోట్ల ఏర్పాటు



పులిగడ్డ మలుపు వద్ద ఏర్పాటు చేసిన కుంభాకార దర్పణం వద్ద ఎస్‌ఐ శ్రీనివాస్

అవనిగడ్డ: ప్రమాదాల నివారణకు అవనిగడ్డ పోలీసులు ప్రయోగాత్మక చర్యలు చేపట్టారు. ప్రమాదకర మలుపుల్లో ఘాట్ రోడ్లలో మాత్రమే ఏర్పాటు చేసే కుంభాకార దర్పణాలను స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోట్ల ఏర్పాటు చేశారు. మొత్తం మూడింటిని తీసుకొచ్చామని ఒకటి పులిగడ్డ చేపల మార్కెట్ వద్ద, రెండోది ఉరకరేవు జెడ్పీ హైస్కూల్ దగ్గర ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ కొప్పిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ప్రమాదాలపై పరిశీలన చేసి అవసరమైన చోట మరొకటి ఏర్పాటు చేస్తామని ఎస్‌ఐ చెప్పారు. మలుపు వద్ద అవతలి వైపున వచ్చే వాహనాలు ఈ కుంభాకార దర్పణాల్లో స్పష్టంగా కనబడుతున్నాయి. దీనివల్ల అవతల ఏ వాహనం వస్తుందో గమనించి ఆ దిశగా వాహనాలు తప్పుకోవడానికి వీలుంటుంది. ఇటీవల బదిలీపై అవనిగడ్డ పోలీస్ స్టేషన్‌కు ఎస్‌ఐగా వచ్చిన శ్రీనివాస్ మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చేపట్టిన ప్రయోగాత్మక చర్యలను వాహనదారులు అభినందిస్తున్నారు.

ప్రతిభకు దక్కిన ప్రశంస





జేసీ గీతాంజలి శర్మ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న పెడన దేవదాయశాఖ ఈవో మోహనరావు, పెడన ఎంపీడీవో రెడ్డయ్య , గూడూరు మండలం మల్లవోలు కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు

పెడన: అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు ఏటా పంద్రాగస్టున ప్రశంసాపత్రాలను అందజేయడం రివాజు. ఈ ఏడాది కూడా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ చేతుల మీదుగా పలువురు ఉద్యోగులు పెడన మండలానికి చెందిన పలువురు ఈ ప్రశంసా పత్రాలను అందుకున్నారు. పెడన ఎంపీడీవో వి.రెడ్డయ్య, దేవదాయశాఖ ఈవో టీవీవీ మోహనరావు, పంచాయతీ కార్యదర్శి మీరా, పెడన మండలం పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు కె.పవన్‌కుమార్, పుట్ల చరణ్‌తో పాటు ఎస్ఎస్ ఉపాధ్యాయుడు కృపావర్ధన్ ప్రశంసాపత్రాలను అందుకున్నారు.



పెడన ఎంపీపీ వాణి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న సచివాలయ ఉద్యోగులు



జేసీతో పెనుమల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

- పెడన ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజులపాటి వాణి పది మంది సచివాలయ ఉద్యోగులకు అవార్డులను అందజేశారు. పింఛన్ల పంపిణీలో ముందంజలో ఉన్నందుకు వీరికి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జారీ చేసిన ప్రశంసాపత్రాలను ఎంపీపీ అందజేశారు.

గూడూరులో...

గూడూరు: మండలంలో ఉత్తమ పనితీరు కనపర్చిన పలువురు ఉద్యోగులు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. మచిలీపట్నం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి స్వాతంత్ర్య దిన వేడుకలలో మల్లవోలు పంచాయతీ కార్యదర్శి టి.వి.వి.సుబ్రహ్మణ్యేశ్వరరావు ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.

మండల స్థాయిలో 10 మందికి...

మండల స్థాయిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనపర్చిన వివిధ సచివాలయాల ఉద్యోగులు గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు. రాయవరం డిజిటల్ అసిస్టెంట్ జన్న జయలక్ష్మి, రామరాజుపాలెం ఎనర్జీ అసిస్టెంట్ ఆకునూరి దుర్గాప్రసాద్, వెటర్నరీ అసిస్టెంట్ పామర్తి జయశ్రీ, గూడూరు-2 వెల్ఫేర్ అసిస్టెంట్ అనుమకొండ వెంకట సాయి, మల్లవోలు-2 పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5 చోడగం సాయి పవన్ కుమార్, మల్లవోలు-1 సర్వేయరు పడమట నరసింహస్వామి, కంచాకోడూరు వీఆర్వో కర్నాటి బాజీరావు, ముక్కొల్లు ఇంజినీరింగ్ అసిస్టెంట్ సుమీత్, కంచాకోడూరు మహిళా పోలీసు నాగపవిత్ర, రాయవరం వెల్ఫేర్ అసిస్టెంట్ యూనుస్ మొహ్మద్ ఉన్నారు.



గూడూరు ఎంపీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న సచివాలయ ఉద్యోగులు

బంటుమిల్లిలో...



ప్రశంసా పత్రాలు అందుకున్న సచివాలయ ఉద్యోగులతో ఎంపీపీ తదితరులు

బంటుమిల్లి: మండలంలో ఆగస్టు నెలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సకాలంలో అందజేసిన 12 మంది సచివాలయ ఉద్యోగులు జిల్లా కలెక్టరు ప్రశంసా పత్రాలకు ఎంపికయ్యారు. ఈ పత్రాలను ఎంపీపీ వి.చినబాబు సచివాలయ ఉద్యోగులకు అందజేసి అభినందించారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారిలో జి.ప్రదీప్, డి.శ్రీనివాసరావు, జి.జాన్ (కంచడం సచివాలయం), పి.ఉమాదేవి(ములపర్రు), బి.ప్రశాంతి, జి.శ్రీనివాసరావు(నాగేశ్వరరావుపేట), కె.రాజశేఖర్, బి.వెంకన్న, ఎస్.సుగుణ(బంటుమిల్లి-2), సుదర్శనం(సాతులూరు), బాలాజీ(ముంజులూరు)ఉన్నారు. వీరిని ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు అభినందించారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

మెడికల్ క్యాంపులు...మందులు అందజేత



పెడన హనుమాన్ కాలనీలో వైద్య శిబిరం వద్ద మందులు ఇస్తున్న వైద్య సిబ్బంది

పెడన: పట్టణంలో ఏ కాలనీ చూసినా విష జ్వరాల బాధితులే దర్శనమిస్తున్నారు. ప్రధానంగా పట్టణంలోని చెంచుల కాలనీ, హనుమాన్ కాలనీ, రామలక్ష్మీ వీవర్స్ కాలనీ, దక్షిణ తెలుగుపాలెంలలో జ్వరబాధితులు ఎక్కువగా దర్శనమిస్తున్నారు. మరో పక్క ప్రభుత్వాసుపత్రులు, ప్రైవేటు ఆసుపత్రులు అన్నీ జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. పట్టణ, పెడన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ ఆసుపత్రికి వెళ్లలేని వారిని సైతం గుర్తించి వారికి మందులను అందజేసే బాధ్యతలను ఆయా వార్డులకు చెందిన ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తీసుకున్నారు. అధికారులు సైతం ఇంకా ఎక్కడైనా జ్వరబాధితులుంటే వారిని కూడా గుర్తించాలని ఆదేశాలు జారీ చేయడంతో మహిళా పోలీసులు, సచివాలయ ఉద్యోగులు కూడా ఇంటింటికీ తిరుగుతూ జ్వరంతో బాధపడుతున్న వారుంటే వారి వివరాలను నమోదు చేసుకునే పనిలో సచివాలయ ఉద్యోగులు, మహిళా పోలీసులు నిమగ్నమయ్యారు. డెంగీ, చికున్‌గున్యా, మలేరియా వంటి జ్వరాల నివారణకు పరిస్థితి చేయి దాటిపోకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. దోమల బెడద అధికంగా ఉండటంతో విషజ్వరాల ప్రభావం ఎక్కువగా ఉందని, వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల కూడా ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉన్న వారికి జ్వర లక్షణాలు త్వరగా అంటుకుంటున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఏది ఏమైనా పుర ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యులు, మున్సిపల్ అధికారులు సూచిస్తున్నారు.

ఘంటసాలలో బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం ప్రారంభం

ఘంటసాల: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ఘంటసాలలోని శ్రీబాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి వారిని దర్శించుకునే బ్రాహ్మణ భక్తుల కోసం బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం ప్రారంభించినట్లు నిర్వాహకుడు ఘంటసాల కృష్ణమోహన్ తెలిపారు. మండల కేంద్రమైన ఘంటసాల గ్రామంలోని శ్రీజలధీశ్వర స్వామి వారి వెనుక శ్రీ సదానంద తీర్థ వరసిద్ధి వినాయక శ్రీ బాలపార్వతీ జలధీశ్వర స్వామి బ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రాన్ని చల్లపల్లికి చెందిన బ్రాహ్మణ సంఘం నాయకుడు పత్రి హనుమంతరావు శుక్రవారం పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నదాన సత్రం నిర్వాహకులు ఆర్.శ్రీమహాలక్ష్మీ, ఘంటసాల కృష్ణమోహన్ మాట్లాడుతూ గ్రామంలోని దేవాలయాలను దర్శించడానికి వచ్చే బ్రాహ్మణ భక్తులకు ప్రతి రోజూ ఉచితంగా భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసి ఇతర భక్తులకు కూడా భోజన సదుపాయం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డీవీ శేషాచార్యులు, పిసుపాటి నరసింహారావు, రిటైర్డ్ తహసీల్దార్ రాధాకృష్ణ, కొక్కిలిగడ్డ ప్రసాద్, అర్చకులు చావలి కృష్ణ కిషోర్, చలపతి, డాక్టర్ హరీష్, కె.కోదండరామశర్మ, దక్షిణామూర్తి, ఘంటసాల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

తహసీల్దార్ బి.విజయ ప్రసాద్

ఘంటసాల: దిగువ ప్రాంత రైతులకు సాగునీరు అందేందుకు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తహసీల్దార్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ ఘంటసాల మండలం దాలిపర్రు గ్రామ రైతులు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సాగునీరు సక్రమంగా పంపిణీ చేయడానికి ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు శాఖలతో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఘంటసాల మండలంలోని మల్లంపల్లి, చిలకలపూడి, వి.రుద్రవరం, ఘంటసాల, దాలిపర్రు, దేవరకోట, పూషడం, మల్లాయి చిట్టూరు, యండకుదురు, లంకపల్లి గ్రామాల్లో రైతులు సాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను గుర్తించినట్లు తెలిపారు. దీంతో ఆయా గ్రామాలకు ప్రవహించే భీమనది కాలువ వెంబడి తూములను ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మూసివేసి, ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని తోడకుండా దిగువ ప్రాంత రైతులకు సాగునీరు వచ్చేలా కమిటీ సభ్యులు పర్యవేక్షించాలని తహసీల్దార్ ఆదేశించారు. మల్లంపల్లి, చిలకలపూడి, వి.రుద్రవరం గ్రామాలకు వీఆర్వోలు వి.నాగేశ్వరరావు, జి.గిరి ప్రసాద్, పోలీసు శాఖ తరపున అర్జునరావు, ఘంటసాల గ్రామానికి వీఆర్ఏలు వి.వేణుగోపాలరావు, కె.బాబూజీ, దాలిపర్రు, దేవరకోట గ్రామాలకు వీఆర్వో ఈ.నాగేశ్వరరావు, వీఆర్ఏలు పి.సాయిబాబు, ఎం.సుబ్బారావు, పూషడం, చిట్టూరు గ్రామాలకు వీఆర్వో టి.రవి కుమార్, వీఆర్ఏ ఎం.యేసుదాసు, పోలీసు వేణు, యండకుదురు గ్రామానికి వీఆర్వో టి.రవి కుమార్, వీఆర్ఏ ఎం.రామకృష్ణ, లంకపల్లి గ్రామానికి వీఆర్వో కె.నాగరాజు, వీఆర్ఏ కె.యేసు, పోలీసు చంద్రశేఖర్ ఇరిగేషన్ శాఖ వారితో సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

దాలిపర్రు పంటకాలువలో తూముల మూసివేత

దాలిపర్రు భీమనది కాలువ పరిధిలో కమిటీ సభ్యులైన లంకపల్లి వీఆర్వో కర్రా నాగరాజు, కానిస్టేబుల్ చంద్రశేఖర్ లష్కర్ సాయంతో కాలువలో సాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న తూములను మూసివేయించారు.

పెడన విద్యార్థులకు జిల్లా స్థాయి బహుమతులు



నాగలలిత



జగదీష్ వర్మ

పెడన: ఈ నెల 13న మచిలీపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో పెడన విశ్వభారతి హైస్కూల్ విద్యార్థులు వుమ్మిటి నాగలలిత(10 వ తరగతి) డిబేటింగ్‌లో ద్వితీయ, లంకె జగదీష్ వర్మ (8 వ తరగతి) వక్తృత్వ పోటీలో తృతీయ బహుమతులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎ.గౌరీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో గురువారం నిర్వహించిన వేడుకలలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ నుంచి వీరిద్దరూ బహుమతులను అందుకున్నారని పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. నగరంలోని సాంఘిక సంక్షేమశాఖ ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం వసతి గృహ పరిసరాలు, నివాస గదులు, వంటగది, భోజనశాల తదితర వసతులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ టి.శ్రీనివాసరావు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీలి మునలయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తం

- **భక్తులతో కళకళలాడిన ఆలయాలు**

బంటుమిల్లి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో దేవాలయాలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా భక్తులతో కళకళలాడాయి. స్థానిక శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, అర్తమూరు, బంటుమిల్లి, పెదతుమ్మిడి తదితర గ్రామాల్లోని శివాలయాలు, వైష్ణవాలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు తమతమ ఇళ్ల వద్ద సంప్రదాయ పద్ధతిలో నోములు నోచుకున్నారు. ముత్తయిదువలకు వాయనాలు, తాంబూలాలు ఇచ్చి ఆశీర్వచనాలు తీసుకున్నారు.

- **ఘనంగా పోతురాజు, పోలేరమ్మల జాతర**

కృత్తివెన్ను: శ్రావణమాసంలో కొమాళ్లపూడి పాటిమీద గ్రామంలో కొలువుతీరి ఉన్న పోలేరమ్మతల్లి, పోతురాజు జాతరను శుక్రవారం వలవల నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం కాసానిగూడెంకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా సారెతో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, పొంగళ్ల నైవేద్యంగా సమర్పించారు.

- **ఆకట్టుకున్న గజలక్ష్మీ అలంకారం**

అవనిగడ్డ: స్థానిక గీతామందిరంలోని రాజ్యలక్ష్మీ అమ్మవారు శుక్రవారం గజలక్ష్మీ అలంకారంలో ఆకట్టుకుంది. వరలక్ష్మీ వ్రతంను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అలంకారం, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని వరలక్ష్మీ వ్రతం పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త శ్రీహరిబాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

- **భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం పూజలు**

గూడూరు: శ్రావణ మాసం రెండవ శుక్రవారం పురస్కరించుకుని గూడూరు మండలంలో భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. ఈ సందర్భంగా ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గూడూరులోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మ వారికి విశేష సహస్ర కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి టీవీవీ మోహనరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

- **వరాల తల్లీ...పాహిమాం!**

కోడూరు: శ్రావణమాసంలోని రెండవ శుక్రవారాన్ని పురస్కరించుకుని మహిళలు వరలక్ష్మీ వ్రత పూజలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ప్రతి ఇంటి వద్ద లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. అమ్మవారి ప్రతిమను నెలకొల్పి నైవేద్యాలను సమర్పించారు. ముత్తయిదువలకు పండ్లు, పూలు అందించి సుమంగళిగా ఉండాలంటూ అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అమ్మవారి ప్రతిమ కలిగిన బంగారు రూపులు కట్టుకొని భక్తిభావం చాటుకున్నారు. కోడూరులోని కల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని వరలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమందించారు. ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామి, లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీదేవి, కోడూరు వాసవీ, కనకదుర్గమ్మ, గంగాభవానీ అమ్మవారి ఆలయాల్లో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది.

- **సువాసినీల సామూహిక వరలక్ష్మీ వ్రతం**

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండలంలోని కొక్కిలిగడ్డ గ్రామంలో శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా సువాసినీలచే సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించిన అనంతరం పలు గ్రామాల నుంచి వచ్చిన సువాసినీలు సామూహికంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. అనంతరం స్వామి వారు, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- **భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం**

కృత్తివెన్ను: శ్రావణ శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. వేకువజామునే నీలిపూడి మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంతో పాటు, కనకదుర్గమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్లలో కొత్తబియ్యాన్ని పీఠంగా ఏర్పాటు చేసి బిందెకు చీరకట్టి, మర్రి చిగుళ్లను అలంకరణగా జతచేసి అమ్మవారి ప్రతిమగా ఏర్పాటు చేసుకుని పూజించడం ఆనవాయితీ. గ్రామీణ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

- **24 మద్యం సీసాలు పట్టివేత**

కోడూరు: ఇరాలి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర 15 మద్యం సీసాలు, బందరు మండలం వాడపాలెంకు చెందిన మరో వ్యక్తి దగ్గర తొమ్మిది మద్యం సీసాలను పట్టుకున్నట్లు ఎస్ఐ శిరీష తెలిపారు.